క్లుప్తంగా

నిరాశ్రయుడికి నేత్ర శస్త్ర చికిత్స


శస్త్ర చికిత్స చేయించుకున్న వృద్ధుడు

ఎంవీపీ కాలనీ: ఓ నిరాశ్రయుడికి కంటి శస్త్ర చికిత్స చేయించి 17వ వార్డు పెదవాల్తేర్‌లోని రెడ్‌క్రాస్ హోమ్ ప్రతినిధులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. చింతాలు అనే 68 ఏళ్ల వృద్ధుడు గత కొన్నేళ్లుగా రెడ్ క్రాస్ హోమ్‌లో నివాసం ఉంటున్నాడు. అతనికి ఎవరూ లేరు. చింతాలకు చాలా కాలంగా ఒక కన్ను కనిపించడం లేదు. దీనికి తోడు ఇటీవల రెండో కన్ను కూడా దెబ్బతిని చూపు కోల్పోయాడు. హోమ్ ప్రతినిధుల ప్రతిపాదనతో అతని కంటికి ఉచితంగా శస్త్ర చికిత్స చేసేందుకు విశాఖ ఐ హాస్పటల్ ప్రతినిధులు ముందుకొచ్చారు. దీంతో మంగళవారం అతనికి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. రెడ్‌క్రాస్ నిర్వాహకుడు మురళీతో పాటు విశాఖ ఐ హాస్పటల్ వైద్యులకు చింతాలు కృతజ్ఞతలు తెలిపాడు.

ఈవీఎంలపై అవగాహన


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

ఏయూ క్యాంపస్: తూర్పు నియోజకవర్గంలో రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తయిన నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఈవీఎంల వినియోగంపై ఆంధ్రా యూనివర్సిటీ న్యూక్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సదస్సులో తూర్పు నియోజకవర్గం ఆర్వో, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పాల్గొని కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఈవీఎంల వినియోగాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని, సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కామేశ్వరరావుకు అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు


కామేశ్వరరావుకు అవార్డును ప్రదానం చేస్తున్న రిటైర్డ్ జస్టిస్ శ్యాంప్రసాద్

బీచ్ రోడ్డు: నగరానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, ప్రజాస్వామ్యవాది దల్లి కామేశ్వరరావు ప్రతిష్ఠాత్మక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. మెగా సిటీ నవకళ వేదిక, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా ప్రకటించిన ఈ అవార్డులను రిటైర్డ్ జస్టిస్ శ్యాంప్రసాద్ ప్రదానం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అనేక మంది పేద యువతకు విద్య, ఉద్యోగాల విషయంలో అందించిన సేవలకు ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కామేశ్వరరావును పలువురు అభినందించారు.

నోటుకు ఓటు.. అభివృద్ధికి చేటు


ప్రచార ఆటోలను ప్రారంభిస్తున్న వీరమాచనేని, డాక్టర్ రాంబాబు

బీచ్ రోడ్డు: నోటుకు ఓటు అభివృద్ధికి చేటు అంటూ గాంధీ గుడి సంస్థ విలువలతో కూడిన ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బుధవారం బీచ్‌రోడ్డులో ఆ సంస్థ రెండు ఆటోల ద్వారా చేపట్టిన అవగాహన కార్యక్రమాన్ని ప్రొఫెసర్ బాల వీరమాచనేని, డాక్టర్ రాంబాబు జెండా ఊపి ప్రారంభించారు. తమ సంస్థ ద్వారా ప్రజలకు ఓటు విలువ తెలిసేలా రెండు తెలుగు రాష్ట్రాల్లో 48 నగరాల్లో ఆటోల ద్వారా ఈ నెల 10వ తేదీ వరకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికల జోష్


జనసేన నుంచి పార్టీలో చేరిన 10వ వార్డు యువతతో ఎంపీ ఎంవీవీ తదితరులు


టీడీపీ నుంచి పార్టీలో చేరిన 27వ ప్రజలతో ఎంవీవీ తదితరులు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీలోకి ప్రతిపక్షాల నుంచి చేరికలు కొనసాగుతున్నాయి. 10వ వార్డు ఆదర్శ నగర్, సుందర్‌నగర్, ఎస్‌బీజీ నగర్‌కు చెందిన 100 మందికి పైగా యువకులు జనసేన, టీడీపీ నుంచి వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బోండా శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేరారు. బుధవారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ సమక్షంలో లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా రంజక పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు వెల్లడించారు. కుల, మతాలకు అతీతంగా ముఖ్య మంత్రి జగన్ పేద ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నారంటూ వారు కొనియాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని ఈ సందర్భంగా వారికి ఎంవీవీ సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు మొల్లి హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డు నుంచి 50 మంది

జీవీఎంసీ 27వ వార్డు నుంచి 50 మంది యువకులు, స్థానిక ప్రజలు వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రవిరాజు, ఎం.రామకృష్ణ, గణేష్, దేవరాజు, మార్కెండేయులు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మోసాల చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పండి

- కాపు నేత వంగవీటి రంగాను హత్య చేసిన వెలగపూడిని తరిమికొట్టండి
- 50వ మేము సిద్ధం సభలో వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ పిలుపు



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

బీచ్ రోడ్డు: కూటమిగా 2014లో 650 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చంద్రబాబుకు మళ్లీ ఇప్పుడు ఓటుతో బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం 50వ మేము సిద్ధం సభను జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరితమైన హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని మార్చిపోయిన బాబు అండ్ కో.. ఇప్పుడు మరో 170 హామీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. 2019లో ఇచ్చిన హామీలను సుమారు వంద శాతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఇప్పుడు వాటి కోసం సీఎం వైఎస్ జగన్ చెప్పి 2024 మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వచ్చారన్నారు. కాపునేత వంగవీటి రంగాను హత్య చేసి విశాఖ పారిపోయి వచ్చిన వెలగపూడిని తరిమికొట్టాలన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం కావాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. 50వ సిద్ధం సభ కావడంతో భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, జోనల్ అధ్యక్షుడు అల్లంపల్లి రాజబాబు, వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కంటి ఆస్పత్రికి పరికరాల అందజేత


పరికరాల జాబితాను కలెక్టర్ మల్లికార్జునకు అందజేస్తున్న డాక్టర్ వెంకట కృష్ణారావు

మహారాణిపేట : ఆంధ్ర వైద్య కళాశాల 1951వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని డాక్టర్ మద్దిమిశెట్టి అమృతవల్లి తాయారమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమార్తె రెడ్నం చంద్రకళారావు, అల్లుడు డాక్టర్ రెడ్నం వెంకట కృష్ణారావు రూ.41 లక్షల విలువ గల ఆధునిక పరికరాలను విశాఖ ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రికి అందజేశారు. బుధవారం కలెక్టర్ మల్లికార్జునను కలిసి పరికరాల జాబితా, ఇతర వివరాలతో కూడిన నివేదికను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దాతలను అభినందించి, ధన్యావాదాలు తెలిపారు.

ఎంవీవీ పాదయాత్ర @ 100


19వ వార్డు పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా 100వ జోరుకు చేరుకుంది. నియోజకవర్గ ప్రజల నీరాజనాలు అందుకుంటూ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వారితో మమేకమవుతూ.. ఉత్సాహాన్ని నింపే దిశగా ఎంవీవీ యాత్ర సాగింది. తూర్పులో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం పేరుతో ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు. అడుగడుగునా ప్రజలు నీరాజనాలు అందుకుంటూ ముందుకు సాగిన ఈ పాదయాత్ర 100వ రోజుకు చేరుకోవడంపై పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. 19వ వార్డులో జరిగిన ఈ వేడుకల్లో ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ఈ పాదయాత్ర ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.

మేలు పొందితే అండగా నిలవండి

- సీఎం జగన్ పాలనను మరోసారి ఆశీర్వదించండి
- 19వ వార్డు సిద్ధం సభలో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ


మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ


సిద్ధం సభకు హాజరైన జాలరిపేట వాసులు

ఎంవీపీ కాలనీ: విద్య, వైద్య, సేవా రంగాల్లో రాష్ట్రం విప్లవాత్మక అభివృద్ధి సాధించిందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 19వ వార్డులో జాలరిపేటలో బుధవారం మేము సిద్ధం – మా బూత్ సిద్ధం పేరిట నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ మేలు జరిగిందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా గత ఐదేళ్ల జగనన్న పాలన సాగిందన్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యారంగాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దారన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తేవడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేటర్ వైద్యాన్ని ప్రజలకు చేరవ చేశారని చెప్పారు. సేవా, సంక్షేమం, అభివృద్ధి ప్రధానంగా సాగిన జగనన్న పాలనతో ప్రతి ఇంటికీ మంచి జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో మేలు పొందిన ప్రతి ఓటరూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. పార్టీ అభ్యర్థులకు అఖండ మెజారిటీని అందించాలన్నారు. 19వ వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దనున్నట్లు ఎంవీవీ వెల్లడించారు. గత 6 నెలలుగా విప్లవాత్మక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. రానున్న రోజుల్లోనూ ఇదే తరహాలో వార్డును అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నాయకులు జానకిరామ్, పీవీ నారాయణ, రామచంద్రరావు, దాసు, వార్డు ఇన్‌ఛార్జ్ సూరాడ వెంకటలక్ష్మీ, పలువురు డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం


ఆరిలోవ: 11వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు హారతిస్తున్న మహిళ


ఆరిలోవ: 11వ వార్డు గాంధీనగర్‌లో కార్యకర్తలతో కలిసి ప్రచారం కోసం ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, గొలగాని శ్రీనివాస్


బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరఫున 15వ వార్డులో ప్రచారం చేస్తున్న అప్పారి గిరిబాబు, పీలా వెంకట్, త్రినాథరావు


బీచ్‌రోడ్డు: 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు


బీచ్‌రోడ్డు: 28వ వార్డు రామ్‌నగర్‌లో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు


ఆరిలోవ: ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని 13వ వార్డు రామకృష్ణాపురంలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత, సత్యనారాయణ


ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీకి మద్దతుగా 18వ వార్డు అప్పుఘర్, వాసవానిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న పేర్ల విజయచందర్, తదితరులు


ఏయూ క్యాంపస్: 21వ వార్డు చినవాల్తేరు రామాలయం ప్రాంతంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రవికుమార్


ఏయూ క్యాంపస్: 20వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిపోలి రెడ్డి, బి.రమాదేవి, దాసరి పండరీబాయి


ఏయూ క్యాంపస్: 22వ వార్డులో ఇస్త్రీ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, తదితరులు

ఏయూ సమాచారం..

డీజిల్ ఇంజిన్ సామర్థ్యం పెంచే పరిశోధనకు డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ ఇంజినీరింగ్ విభాగ పరిశోధక విద్యార్థి పుల్లగూర గాంధీకి డాక్టరేట్ లభించింది. విభాగాచార్యులు వి.వి.ఎస్.ప్రసాద్ పర్యవేక్షణలో 'సాధారణ డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా బయో డీజిల్, నానో ఫ్లూయిడ్స్, హైడ్రోజన్ ఉపయోగించి మంచి ఫలితాలు సాధించవచ్చునని, ఉద్గారాలను నియంత్రించగలమని' తన పరిశోధనలో గుర్తించారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి గాంధీ ఉత్తర్వులు అందుకున్నారు.

బీసీ మేనిఫెస్టో పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని ఏయూ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజు అన్నారు. బుధవారం విభాగంలో బీసీ మేనిఫెస్టో పుస్తకం 5వ ముద్రణను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పరికిపండ్ల అశోక్, తత్వశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.వెంకటరావు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ హరిబాబు, ఆచార్య పి.ప్రేమానందం, వెంకటరమణ, కనకరాజు, శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

'మనిషికి ఆభరణంగా కృతజ్ఞత'


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఆచార్య మలయవాసిని

ఏయూ క్యాంపస్: మనిషికి కృతజ్ఞత ఆభరణంగా నిలుస్తుందని ప్రముఖ విద్యావేత్త, ఏయూ తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు కె.మలయవాసిని అన్నారు. బీచ్ రోడ్డులోని జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాలలో నిర్వహిస్తున్న బాలల విజ్ఞాన వికాస శిబిరాన్ని ఆమె బుధవారం ఉదయం ప్రారంభించారు. బాలలకు సత్ప్రవర్తన, మంచి అలవాట్లు, మానవతా దృక్పథం అలవరచాలన్నారు. భారత రామాయణాది గ్రంథాలను కథల రూపంలో వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.వి.ఆర్. విఠల్ మూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.మధురవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాపాడే పార్టీకి మద్దతివ్వండి

- ఘనంగా మేడే వేడుకలు


మద్దిలపాలెం సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంవీఎస్ శర్మ


ఏయూ న్యాయ కళాశాలలో ఉద్యోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు


జూ పార్కు వద్ద కార్మికులతో కలసి మేడే ఉత్సవం జరుపుతున్న సీఐటీయూ నాయకుడు కుమార్

బీచ్ రోడ్డు: ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను స్ఫూర్తితో కార్మిక హక్కులను రక్షించుకోవాలని సీపీఎం నాయకుడు ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా మద్దిలపాలెంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక రాజ్యం వచ్చినప్పుడే కార్మికులు పూర్తి హక్కులు పొందగలుగుతారన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేసి, కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చివేసిందని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాపాడే పార్టీలను ఈ ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

కార్మికుల శ్రమను గుర్తించాలి

ఏయూ క్యాంపస్: కార్మికుల శ్రమను గుర్తించి, గౌరవించినప్పుడే నిజమైన వేడుక అని ఏయూ న్యాయ కళాశాల ఆచార్యులు కె.సీతామాణిక్యం అన్నారు. బుధవారం కార్మిక దినోత్సవం సందర్భంగా ఏయూ న్యాయ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నాలుగో తరగతి ఉద్యోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఆరిలోవ: మేడే సందర్భంగా జూలో పని చేస్తున్న కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో జూ పార్కు గేటు వద్ద జెండా ఆవిష్కరించారు. కార్మికులతో మేడే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం కార్మికులు, కర్షకులపై దాడి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ ఆరిలోవ జోన్ అధ్యక్షుడు పి.శంకరావు, జూ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లో ఆటో స్టాండ్ వద్ద జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె. రెహ్మాన్ జెండా ఆవిష్కరించారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు నౌకానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. పాఠశాల తలుపులు విరగ్గొట్టి, లోపలికి ప్రవేశించారు. బీరువాలను విరగ్గొట్టి లోపల వస్తువులు, రికార్డులు విసిరేశారు. రెండు ఆండ్రాయిడ్ బాక్స్‌లు, 60 స్టీల్ పేట్లు పట్టుకుపోయారు. పాఠశాల స్టీలు గేట్లు, తలుపులకు ఉండే క్యాంపులు, గడియలు విరగ్గొట్టేశారు. పాఠశాలకు చెందిన పలు రికార్డులు సైతం కనిపించలేదు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.కె.డి.కుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల పంపిణీ

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం ఆ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో పేదలకు, నిరాశ్రయులకు పండ్ల పంపిణీ చేశారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దేవరకొండ మార్కండేయులు, తదితరులు ఎంవీపీ కాలనీ, పెదవాల్తేర్, ఆర్కేబీచ్, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న వారికి కూడా పలు రకాల పండ్లతో కూడిన కిట్‌లను అందజేశారు.

నేటి నుంచి యోగా శిబిరం

ఏయూ క్యాంపస్: ఏయూ యోగా కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారులకు నేటి నుంచి రెండు వారాల ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 7 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బాల, బాలికలు ఈ శిబిరంలో పాల్గొనవచ్చునన్నారు. ప్రతి రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు.